

జన్మదిన శుభాకాంక్షలు
మా ప్రియతమ నాయకుడు,
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
తెలుపుకుంటూ..
బోనెల విజయచంద్ర
శాసనసభ్యులు, పార్వతీపురం నియోజకవర్గం


జన్మదిన శుభాకాంక్షలు
నిత్య కృషీవలురు... అలుపెరగని పోరాట యోధులు..
ప్రజల మనిషి... అభివృద్ధి ప్రధాత..
సంక్షోభాన్ని సంక్షేమంగా మార్చే మేధావి...
సంపద సృష్టికర్త... తెలుగు ప్రజల నమ్మకం..
జనం మెచ్చిన నాయకులు.. గౌరవ ముఖ్యమంత్రి..
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
గౌ॥శ్రీ॥ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
బోనెల విజయచంద్ర
శాసనసభ్యులు, పార్వతీపురం నియోజకవర్గం

ఇళ్లు కట్టేదెలా?





- నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి
- బస్తా సిమెంట్ రూ.350
- టన్ను ఐరన్ రూ.53,500
- నిర్మాణదారులపై భారం

విజయనగరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగానికి ఎంతో అవసరమైన సిమెంట్, ఐరన్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో బస్తా సిమెంట్ రూ.350, టన్ను ఐరన్ రూ.53,500 పలుకుతోంది. దీంతో నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలతో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపట్టేదని మదనపడుతున్నారు. ఈ ఏడాది జనవరి తొలి వారంలో 53 గ్రేడ్ సిమెంట్ బస్తా ధర రూ.270 నుంచి రూ.280 వరకు ఉండేది. ఫిబ్రవరిలో రూ.300కు పెరిగింది. ప్రస్తుతం రూ.320 నుంచి రూ.350 వరకూ పలుకుతోంది. విజయవాడ, హైదరాబాద్‌తో పాటు ఒడిశా నుంచి జిల్లాలోని హోల్‌సేల్ షాపులకు సిమెంట్ వస్తుంది. ఇక్కడి నుంచి రిటైల్‌గా అమ్మకాలు జరుగుతుంటాయి. జిల్లా వ్యాప్తంగా 200 షాపులకు పైగా ఉన్నాయి. ప్రతిరోజూ వందలాది బస్తాలు విక్రయాలు జరుగుతుంటాయి. అదే విధంగా టన్ను స్టీల్ ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.53,500 ఉంది. విజయనగరంలోని ప్రస్తుతం నాలుగైదు కంపెనీలకు సంబంధించిన స్టీల్ అందుబాటులో ఉంది. ఆయా కంపెనీల బట్టి ధరలో కూడా రూ.వెయ్యి నుంచి రూ.1,500 వ్యత్యాసం ఉంటుంది. ఏ కంపెనీ అయినా టన్ను రూ.52 వేలు పైమాటే. ఒక ప్రముఖ కంపెనీకి సంబంధించిన స్టీల్ మాత్రం టన్ను రూ.53,500 పలుకుతోంది. జిల్లాలో ప్రస్తుతం పల్లె పండగ పథకంలో సిమెంట్ రహదారులు, కాలువల నిర్మాణంతో పాటు వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అదే విధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో పాటు, వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిన పేదల ఇళ్ల పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం అదనపు సాయం ప్రకటించింది. ఈ తరుణంలో సిమెంటు, ఐరన్ రేట్లు పెరగడంతో లబ్ధిదారులపై పెనుభారం పడింది. రానున్న రోజుల్లో నిర్మాణాలు మందగించనున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటి ధరలను అదుపులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

సిమ్మెంట్ ధర పెరుగుతూ వస్తున్నది..

ఇంటి నిర్మాణాన్ని సంక్రాంతి తరువాత మేము ప్రారంభించాం. అప్పుడు సిమెంట్ బస్తా రూ.275 నుంచి రూ.280 ఉండేది. ఇప్పుడు రూ.350కి పెరిగింది. స్టీల్ టన్ను రూ.53,500 ఉంది. ఇసుక మాత్రం ఉచితంగా లభిస్తుంది. రవాణా చార్జీలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇసుక లభ్యత ఉన్నా, సిమెంట్, స్టీల్ ధరలు పెరగడంతో ఇంటి నిర్మాణం ఆపేశాం.

-సీహెచ్ గౌరీ, విజయనగరం

మెగా డీఎస్సీ

- నేడు నోటిఫికేషన్ జారీ చేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 583 పోస్టుల భర్తీ
- నిరుద్యోగుల్లో ఆనందోత్సాహాలు

విజయనగరం/కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు ఉపా ధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మెగా డీఎస్సీకి ఆదివారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. దీంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు ఉపాధ్యాయ పోస్టుల భర్తీని విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. టెట్ నిర్వహించి నవంబరులోనే ఫలితాలు ప్రకటించింది. ఇటీవల సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో జూన్‌నాటికి పోస్టుల భర్తీని పూర్తి చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 583 ఉపాధ్యాయ పోస్టులు (137 గిరిజన ఆశ్రమ పాఠశాలలను కలుపుకొని) భర్తీకానున్నాయి. స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులతో పాటు వివిధ గురుకులాలు, రెసిడెన్సీ, మోడల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు.

గంజాయితో పట్టుబడిన విద్యార్థులు

- కంచేడువలసలో కొనుగోలు చేసినట్లు పోలీసులకు వెల్లడి
- ముమ్మరంగా దర్యాప్తు

బొబ్బిలి/మక్కువ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో మూడు రోజుల కిందట ముగ్గురు విద్యార్థులు గంజాయితో పట్టుబడ్డారు. వారి భవిష్యత్ నాశనం కాకూడ దనే ఉద్దేశంతో పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. విద్యార్థులను విచారించ గా పలు విషయాలు వెలుగుచూశాయి. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం కొయ్యానపేట పంచాయతీ కంచేడువలస గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి విద్యార్థులు గంజాయిని కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో బొబ్బిలి పోలీసులు మక్కువ పోలీసుల సహకారంతో కంచేడువలస వెళ్లి గంజాయి సాగుచేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐ కటకం సతీష్ కుమార్, ఎస్ఐ రమేష్ ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని, పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.



స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి కొండపల్లి

వచ్చే నెల నుంచి వింతంతు పింఛన్లు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) వచ్చే నెల నుంచి వితంతువులకు పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎస్ఎంఈ ఎన్ఆర్ఐ, సెర్ప్ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని వసాది, బురదపాడు, రేగుబిల్లి, కొర్లాం గ్రామాల్లో సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. దీనికి ముందు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కొర్లాం గ్రామంలోని ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ వితంతువులకు గత సెప్టెంబరు నుంచి పింఛన్లు మంజూరు చేయాలని అనుకున్నామని, కొన్ని సాంకేతిక కారణాలు వల్ల ఇవ్వలేక పోయామని వెల్లడించారు. అలాంటి వారికి మే నుంచి మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలోని తహసీల్దార్ నీలకంఠేశ్వరెడ్డి, ఎంపీడీవో రమణమూర్తి, పంచాయతీరాజ్ డీఈ ప్రసాద్, జేఈ కృష్ణమూర్తి, తాటిపూడి ఆయకట్టు చైర్మన్ కె.జగన్నాథం తదితరులు ఉన్నారు.

స్పందించి.. ముందుకొచ్చి

- బొబ్బిలి గురుకులాన్ని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన
- విద్యాశాఖ మంత్రి లోకేశ్ పిలుపుతో అభివృద్ధికి కంకణం
- పాఠశాల రూపురేఖలు మారుస్తానని హామీ

బొబ్బిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని రెండు పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఇచ్చిన పిలుపునకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన స్పందించారు. ఎన్టీఆర్ హయాంలో మంజూరైన బొబ్బిలి ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలను దత్తత తీసుకునేందుకు ముందుకువచ్చారు. ఈ మేరకు గురుకులాన్ని శనివారం సందర్శించారు. తరగతి గదులు, డార్మెటరీ, పరిపాలనా గదులు, విద్యార్థుల బాత్‌రూమ్‌లు, కిచెన్ తదితర వాటిని పరిశీలించారు. సరిపడ స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే కుళాయిల దగ్గర స్నానాలు చేస్తున్నట్లు గుర్తించారు. పక్కనే ఉన్న పాడుబడిన భవనాలను ఆధునీకరించి వాటిని బాత్‌రూమ్‌లు లేదా ఇతరత్రా అవసరాలకు వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని ఇంజనీర్లను ఆదేశించారు. విద్యార్థులతో రహస్యంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నించారు. వారు ముందుకురాకపోవడంతో గురుకుల ఆవరణలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేస్తానని తెలిపారు. విద్యార్థులు నిర్భయంగా తమ సమస్యలను రాసి ఫిర్యాదుల పెట్టెలో వేయాలన్నారు. పెట్టె తాళం తనవద్దే ఉంటుందన్నారు. గురుకులంలో రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులెంతమంది పనిచేస్తున్నారు? వారి పనితీరు ఎలా ఉంది? అని ఆరా తీశారు. నాన్‌టీచింగ్ స్టాఫ్ పనితీరుపై తనకు వ్యక్తిగతంగా అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, వెంటనే సరిచేసుకోవాలని హెచ్చరించారు. రాత్రివేళ కాపలాదారు కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. ఆహార నాణ్యత, వైద్యసేవలు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని తెలుసుకొని తక్షణం ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పూర్వవిద్యార్థుల సహకారంతో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, దాతల సహకారంతో అన్ని సదుపాయాలు కల్పించి గురుకులం రూపురేఖలు మారుస్తానని తెలిపారు. ప్రతీ నెలా రెండు దఫాలు కచ్చితంగా సమావేశమై పాఠశాల అవసరాలకు సంబంధించి విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ప్రతిపాదనలు పంపిస్తానని అన్నారు. క్రీడా ప్రాంగణాన్ని మరింతగా అభివృద్ధి చేసి అన్ని రకాల క్రీడలను విద్యార్థులతో ఆడించాలని ఉపాధ్యాయులకు సూచించారు. క్రీడా పరికరాలను తాను స్వయంగా సమకూరుస్తానని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రఘునాథ్, ఎస్ఎస్ఏ సిబ్బంది, టీడీపీ నాయకులు ఉన్నారు.



గురుకులంలో డార్మెటరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

ప్రైవేటు ఆసుపత్రులకు ఎందుకెళ్తున్నారు?

- సీసీ కెమెరాలు ఎందుకు పని చేయలేదు?
- జిల్లా ప్రత్యేకాధికారి ప్రశ్నల వర్షం
- గంట్యాడ పీహెచ్‌సీ తనిఖీ



ఆసుపత్రిలో మందులను తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు

గంట్యాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) కార్పొరేట్ ఆసుపత్రి సదుపాయాలు ఉన్నా రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు ఎందుకు వెళ్తున్నారని జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు ప్రశ్నించారు. ఇక్కడ ఉన్న పరికరాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. శనివారం మధ్యాహ్నం ఆయన గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల గది, ల్యాబ్, స్టాక్ రూం రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఇక్కడ అధునిక పరికరాలు ఉన్నా సక్రమంగా వినియోగిచడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మందులను సకాలంలోని వినియోగించాలని సూచించారు. ఆసుపత్రిలోనే అన్ని రకాలు పరీక్షలు జరగాలన్నారు. థైరాయిడ్ పరీక్షలకు మాత్రమే జీజీహెచ్‌కు పంపిస్తున్నామని సిబ్బంది చెప్పగా.. పరీక్షల అనంతరం ఇక్కడే మందులు ఇస్తున్నారా? అని ప్రత్యేకాధికారి ప్రశ్నించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించారు. కరోనా సమయం నుంచి పని చేయలేదని సిబ్బంది చెప్పగా.. 'వాటికి కూడా కరోనా వచ్చిందా? వెంటనే సీసీ కెమెరాలు బాగు చేయించండి' అని ఆదేశించారు. ఆయన వెంట జేసీ సేతుమాధవన్, జిల్లా వైద్యాధికారి జీవరాణి, మలేరియా అధికారి మణి ఉన్నారు.

ప్లాస్టిక్‌ను వాడొద్దన్నారు కదా?

- ఎందుకు టేబుల్‌పై ప్లాస్టిక్ బాటిళ్లు, ఫైళ్లు పెట్టారు
- జిల్లా ప్రత్యేక అధికారిని ప్రశ్నించిన విద్యార్థులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్‌బాబు

శృంగవరపుకోట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'ప్లాస్టిక్‌ను వాడొద్దని ప్రభుత్వం చెబుతుంది కదా. మరి మీ కోసం తాగేందుకు ప్లాస్టిక్ బాటిళ్లతో నీరు, ప్లాస్టిక్ ఫైళ్లతో కూడిన పేపర్లను టేబుల్‌పై ఎందుకు పెట్టారు.' అని విద్యార్థినులు జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్‌బాబును ప్రశ్నించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్‌బాబు హాజరయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం గురించి ఇంగ్లీష్‌లో మాట్లాడాలని విద్యార్థులకు ప్రత్యేకాధికారి సూచించారు. దీంతో తొమ్మిదో తరగతి విద్యార్థినులు పూర్ణిమ, నీలిమ మాట్లాడుతూ.. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎక్కడికక్కడే విసిరేస్తుండడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. ఇ-వ్యర్థాలతో ప్రజలు క్యాన్సర్ వంటి పలు రకాల రుగ్మతల బారిన పడుతున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. ఇదే సమయంలో ప్లాస్టిక్ బాటిళ్లతో తాగునీరు, కాగితాలతో కూడిన ప్లాస్టిక్ ఫైళ్లను స్థానిక అధికారులు టేబుల్‌పై పెట్టారు. వీటిని చూసిన విద్యార్థినులు పూర్ణిమ, నీలిమ.. ఇవే కదా ఇ-వ్యర్థాలు అని అన్నారు. ప్లాస్టిక్‌ను వాడొద్దని అన్నారు కదా అని ప్రశ్నించారు. ఇలా ప్రశ్నించే తత్వం ఉన్నప్పుడు అభివృద్ధి చెందుతారని విద్యార్థులను ఆయన అభినందించారు. ఇ-వ్యర్థాలుగా మారే ప్లాస్టిక్ వస్తువులు సమావేశాల్లో లేకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

చెల్లికి పెళ్లి చేస్తానని చెప్పి మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా..

- జలపాతంలో కొట్టుకుపోయి ఎన్ఐటీ విద్యార్థి మృతి
- మృతుడిది జీడిపేట
- కేరళలో ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న తండ్రి, సోదరి



రేవంత్ (ఫైల్)

మెంటాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'నాన్నా ఇంకో ఏడాదిలో ఉద్యోగంలో చేరుతా. చెల్లికి నేనే వివాహం చేస్తా. తరువాత నిన్ను నా వద్దకు తీసుకుని వెళ్లిపోతా.'అని కుమారుడు చెప్పడంతో ఆ తండ్రి ఎంతో సంతోషించాడు. కానీ, విధి చిన్నచూపు చూసింది. చేతికి అందివచ్చిన కుమారుడిని మృత్యువు మింగేసింది. దీంతో ఆ తండ్రి, సోదరి కన్నీరుమున్నీరవుతున్నారు. చెల్లికి పెళ్లి చేస్తానని చెప్పి మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా? అంటూ తండ్రి రోదిస్తుండడాన్ని చూసి చెమ్మగిల్లని కళ్లులేవు. కేరళ వద్ద జలపాతంలో కొట్టుకుపోయి మెంటాడ మండలం జీడిపేట గ్రామానికి చెందిన పొలిపిరెడ్డి రేవంత్‌కుమార్ (21) అనే యువకుడు మృతి చెందాడు. పొలిపిరెడ్డి అచ్చెంనాయుడు కుమారుడైన రేవంత్ కేరళ రాష్ట్రంలోని కాలీకట్ ప్రభుత్వ కళాశాలలో ఎన్ఐటీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం కాలీకట్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న జలపాతానికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలిజారి రేవంత్ జలపాతంలో కొట్టుకుపోయాడు. కొంత దూరం పోయాక విగతజీవిగా పడిఉన్నాడు. స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు రేవంత్‌కుమార్‌ను బయటకు తీసి స్థానిక ఆసుపత్రికి తరలించారు. తలకి బలమైన గాయం తగలడంతో అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

పది రోజుల కిందటే వచ్చాడు..

రేవంత్‌కుమార్‌కు తండ్రి అచ్చెంనాయుడు, డిగ్రీ చదువుతున్న చెల్లెలు కుసుమ ఉన్నారు. తల్లి పదేళ్ల కిందట మృతి చెందింది. తండ్రి అచ్చెంనాయుడు వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను పోషిస్తున్నాడు. భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకోవాలని బంధువులు, సన్నిహితులు ఒత్తిడి తెచ్చారు. కానీ, పిల్లలు చిన్నవాళ్లు అయినందున, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రెండో పెళ్లికి నిరాకరించాడు. అన్నీ తానై పిల్లలను పెంచి ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. కేరళలోఎన్ఐటీ చదువుతున్న కుమారుడు రేవంత్ పది రోజుల కిందటే ఒక వివాహంలో పాల్గొనేందుకు స్వగ్రామానికి వచ్చాడు. పరీక్షలు ఉన్నాయని చెప్పి, ఈ నెల 13న కేరళ వెళ్లిపోయాడు. నెలాఖరుకు మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిన రేవంత్ మృతి చెందాడు. మరో రెండేళ్లలో కొడుకు అంది వస్తాడని, కాపాలాగా వుంటాడని కలలు కంటున్న తండ్రి కొడుకు మరణవార్తతో కుప్పకూలిపోయాడు. రేవంత్ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు తండ్రి, బంధువులు కేరళకు బయలుదేరారు. సోమవారం నాటికి మృతదేహం స్వగ్రామానికి చేరుకునే అవకాశం ఉంది.


నెల్లిమర్ల చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం?

- జోరుగా సాగుతున్న ప్రచారం



నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం

నెల్లిమర్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్‌పై త్వరలో అవిశ్వాస తీర్మానం పెట్టనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. వైసీపీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన ఓ దళిత మహిళ చైర్‌పర్సన్‌గా గతంలో ఎన్నికయ్యారు. అనంతరం జనసేన పార్టీలో చేరారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లు, పార్టీ పెద్దలు ఆమెపై గుర్రుగా ఉన్నారు. ఇదే క్రమంలో పొత్తులో ఉన్న టీడీపీ, జనసేన మధ్య సఖ్యత అంతంత మాత్రంగానే ఉంది. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు కోరిన రెండు అంశాలను ఆమోదించకుండా చైర్‌పర్సన్ అడ్డుకున్నారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్లు, పార్టీ పెద్దలు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిల్లో ఆమెను ఎలాగైనా పదవి నుంచి దించేయాలనే ఆలోచనతో ఇటు టీడీపీ, అటు వైసీపీ ఉన్నట్లు సమాచారం. అవిశ్వాసం తీర్మానంతో ఆమెను దించేసి, టీడీపీకి చెందిన మరో కౌన్సిలర్‌ను చైర్‌పర్సన్‌గా చేస్తారనే ప్రచారం జోరందుకుంది. నెల్లిమర్ల నగర పంచాయతీలో 20 వార్డులు ఉన్నాయి. ఇక్కడ ఏడుగురు టీడీపీ కౌన్సిలర్లు, 9 మంది వైసీపీ, ముగ్గురు జనసేన, ఒక బీజేపీ కౌన్సిలర్లు ఉన్నారు. టీడీపీకి వైసీపీ సహకరిస్తే అవిశ్వాస తీర్మానం నెగ్గడం పెద్ద కష్టమేమీ కాదు. రానున్న రోజుల్లో పరిస్థితులు ఎలా మారుతాయో చూడాలి.



ఇళ్లు కట్టేదెలా?

- నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి
- బస్తా సిమెంట్ రూ.350
- టన్ను ఐరన్ రూ.53,500
- నిర్మాణదారులపై భారం

6లో



మెగా డీఎస్సీ



- నేడు నోటిఫికేషన్ జారీ చేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 583 పోస్టుల భర్తీ
- నిరుద్యోగుల్లో ఆనందోత్సాహాలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి అనుమతి ఇస్తూ పాఠశాల విద్యాశాఖ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎన్నికల ముందు మాత్రం హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తక్కువ ఉద్యోగాలకు ఇవ్వడంపై అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు ఆందోళనలు చేశారు. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ప్రచారంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అనుకున్నట్లే సీఎం కాగానే డీఎస్సీ ఫైలుపై తొలిసంతకం చేశారు. ఆదివారం ఉదయం నోటిఫికేషన్ జారీ కానుంది. అభ్యర్థుల వయో పరిమితి కూడా గరిష్ఠంగా రెండేళ్లు పెంచడంతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

(పూర్తి వివరాలు 6వ పేజీలో...)

జేఈఈ మెయిన్‌లో మెరిశారు

- జాతీయ స్థాయిలో జిల్లా విద్యార్థులకు ర్యాంకులు



ఆనంద్ చక్రవర్తి 86వ ర్యాంక్ | రొంగళి కార్తీక్ 212వ ర్యాంక్ | పొట్నూరు కార్తీక్ 481వ ర్యాంకు | యోగీశ్వర్ 853వ ర్యాంకు

రామభద్రపురం/గజపతినగరం/బొబ్బిలి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మెరిశారు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ● బొబ్బిలి పట్టణంలోని రత్నాల నగర్‌కు చెందిన పీతల టీను ఆనంద్ చక్రవర్తి ఓపెన్ కేటగిరీలో 86వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 12వ ర్యాంకు సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు పారాది జడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా, తల్లి అనూరాధ పాతపట్నం మోడల్ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ● మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన రొంగళి కార్తీక్ 99.9896 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా స్థాయిలో 212వ ర్యాంక్, ఓబీసీలో 29వ ర్యాంక్ సాధించాడు. కార్తీక్ కుటుంబం గజపతి నగరం మండలం పురిటిపెంటలో నివాసం ఉంటుంది. తల్లిదండ్రులు మురళీసత్యనారాయణ, సత్యవతి ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ●బొబ్బిలి పట్టణంలోని నాయుడు కాలనీకి చెందిన పొట్నూరు కార్తీక్ 281 మార్కులతో 481వ ర్యాంకును సాధించాడు. 99.97 పర్సంటైల్ పొందాడు. తండ్రి కాళీరాం ప్రసాద్ వ్యాపారి కాగా, తల్లి కుమారి గృహిణి. ● రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామా నికి చెందిన జాగాన యోగీశ్వర్ 99.95 శాతం పర్సంటైల్ తో జాతీయ స్థాయిలో 853వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 135వ ర్యాంకు సాధించాడు. యోగీశ్వర్ తండ్రి జాగాన సింహాచలం సాలూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా, తల్లి ఎర్రయ్యమ్మ ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు.

స్పందించి.. ముందుకొచ్చి

- బొబ్బిలి గురుకులాన్ని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన
- విద్యాశాఖ మంత్రి లోకేశ్ పిలుపుతో అభివృద్ధికి కంకణం
- పాఠశాల రూపురేఖలు మారుస్తానని హామీ

6లో

చెల్లికి పెళ్లి చేస్తానని చెప్పి మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా..

- జలపాతంలో కొట్టుకుపోయి ఎన్ఐటీ విద్యార్థి మృతి
- మృతుడిది జీడిపేట
- కేరళలో ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న తండ్రి, సోదరి

6లో



కొత్త ఆలోచనలు చేయాలి

● ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి అధికారి రాజశేఖర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి కొత్త ఆలోచనలు చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి అధికారి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 15 శాతం వృద్ధి రేటు సాధించేందుకు వ్యవసాయ రంగ అభివృద్ధిలో కొత్త ఆలోచనలు, ప్రయోగాలు చేయడం అవసరమన్నారు. శనివారం జిల్లా పర్యటనకు ఆయనతో పాటు ప్రత్యేక అధికారి డాక్టర్ అహ్మద్‌బాబు విచ్చేశారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. వృద్ధి రేటు సాధనపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ సాగులో లేని భూమి ఈ జిల్లాతో సహా రాష్ట్రం మొత్తం మీద 30 లక్షలు హెక్టార్లు ఉందన్నారు. దాన్ని సాగులోకి తేవడం, సాగు విస్తీర్ణాన్ని పెంచడం ముఖ్యమన్నారు. ఒకే పొలంలో బహుళ పంటల సాగు, వ్యవసాయ ఉత్పాతకత పెంచడం వంటి చర్యలు ద్వారా వ్యవసాయ ఆదాయాన్ని పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలో పండించే పంటలు, కూరగాయాలు, పువ్వులు, ఇతర ఉద్యాన ఉత్పత్తులకు విశాఖలో మంచి మార్కెట్ ఉందన్నారు. వచ్చే జూన్ కలెక్టర్ల సదస్సు జరిగే నాటికి వృద్ధి రేటు సాధనలో పురోగతి చూపించడం అవసరమన్నారు. ప్లాస్టిక్ రహితంగా గ్రామాలు, పట్టణాలను తీర్చిదిద్దేందుకు వినూత్న ఆలోచనలు చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ముందుగా ప్రభుత్వ అధికారులు నుంచే దీనికి శ్రీకారం చుట్టాలన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి అధికారి అహ్మద్‌బాబు మాట్లాడుతూ సూక్ష్మ స్థాయి వరకూ వృద్ధి రేటు సాధన లక్ష్యాలపై తగిన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. 15 శాతం వృద్ధి రేటు సాధనకు మండలం, గ్రామం వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి తదితరులు ఉన్నారు.



సమావేశంలో ప్రత్యేకాధికారులు రాజశేఖర్, అహ్మద్‌బాబు

సీఎం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించండి


సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి అశోక్, ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను నగరంలో ఘనంగా నిర్వహించాలని టీడీపీ నాయకులు నిర్ణయించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదివారం చంద్రబాబు జన్మదినం సందర్భంగా మూడులాంతర్ల వద్ద పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నగర, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములవుదాం



రాజాంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే కోండ్రు


నెల్లిమర్లలో మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

రాజాం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. ముందుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పాఠశాల నుంచి బొబ్బిలి రోడ్డు కూడలి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అన్నా క్యాంటీన్ వద్ద మొక్క నాటారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ జె.రామప్పల నాయుడు. తహసీల్దార్ కృష్ణంరాజు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు, స్వచ్ఛత సేవాసంఘాల ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, ఆర్‌వీజే నాయుడు పెంకి చైతన్యకుమార్. ఎంఈవో వె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

●నెల్లిమర్ల: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభించిన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర ర్యాలీకి ఆయన జెండా ఊపారు. అనంతరం రామతీర్థం జంక్షన్‌లో మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్ నాథ్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, టీడీపీ నాయకుడు లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్, అవనాపు సత్యనారాయణ, వానపల్లి వీరభద్రరావు, కింతాడ కళావతి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి మురళీమోహన్, ఎంపీడీవో రామకృష్ణరాజు, తహసీల్దారు సుదర్శన రావు పాల్గొన్నారు.

●బొబ్బిలి: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక రాణిమల్లమ్మదేవి మున్సిపల్ పార్కులో ఎమ్మెల్యే బేబీనాయన చీపురుపట్టి చెత్తను ఊడ్చారు. పార్కులోని ఫౌంటైన్‌ను మళ్లీ వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. పార్కు చుట్టూ గతంలో ప్రతిపాదించిన వాకింగ్ ట్రాక్‌పై ఆరా తీశారు. మున్సిపల్ తాగునీటి రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్: పారాది లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పాల్గొన్నారు.

● రామభద్రపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు కోరారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ●శృంగవరపుకోట: ఇ-వ్యర్థాల సేకరణకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి ఆహ్మద్‌బాబు సూచించారు. శనివారం శృంగవరపుకోట పట్టణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఇ-వ్యర్థాల కోసం ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడించారు. అనంతరం మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, జేసీ సేతు మాధవన్, విద్యార్థులతో కలసి విశాఖ-అరకు రోడ్డు, విజయనగరం రోడ్డులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీడీవో సతీష్, తహసీల్దారు అరుణకుమారి ఉన్నారు.



రామభద్రపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో... బొబ్బిలి: పార్కులో శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే

అసత్యాలు నమ్మేవారు ఎవరూలేరు

●వైసీపీ నేతలపై మంత్రి కొండపల్లి ఫైర్


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మేవారు జిల్లాలో ఎవరూలేరని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. శనివారం సాయంత్రం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ప్రజలను తప్పుదోవ పెట్టించేలా మాట్లాడటాన్ని ఖండించారు. వైసీపీ పాలనలో కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోయారన్నారు. బీసీ ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లలో రుణాలు ఇవ్వలేకపోయారన్నారు. పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. నిధుల కోసం సర్పంచులు రోడ్డెక్కే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గతంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు గురిచేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. పెన్షన్‌లు కట్ చేస్తారని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేసిన వాఖ్యలను ఆయన కొట్టి పడేశారు. కేవలం చనిపోయిన వారి పింఛన్లు మాత్రమే తొలగిస్తున్నామన్నారు. జిల్లా అభివృద్ధి కోసం వేలాది కోట్లతో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ వివరించారు.

'సన్మార్గంలో నడవండి'


రౌడీషీటర్లతో మాట్లాడుతున్న దృశ్యం

విజయనగరం క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు సన్మార్గంలో నడుచుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ హితవు పలికారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శనివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఎస్పీ అధికారులతో మాట్లాడారు. రౌడీషీటర్లు మళ్లీ నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నట్టయితే వారిపై నిఘా పెట్టాలని ఆదేశించారు. నేర ప్రవృత్తిని విడనాడకుంటే కఠినంగా వ్యవహరించాలన్నారు. బ్యాడ్ క్యారెక్టర్ కలిగిన వ్యక్తుల ఫొటోలు తీసి హిస్టరీ షీట్‌లో పొందుపరచాలన్నారు. వారి వివరాలు, ఫొటోలను సీసీటీఎన్ఎస్‌లో నిక్షిప్తం చేయాలని అధికారులకు సూచించారు.

చిన్నారిపై అఘాయిత్యం: పోక్సో కేసు నమోదు

విజయనగరం క్రైం/ రింగురోడ్డు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలో ఓ ప్రాంతానికి చెందిన జి.పైడిరాజు కూలీ పనిచేసుకుని జీవనోపాధి చేసుకుంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి మాయమాటలు చెప్పాడు. పక్కకు తీసుకువెళ్లి ఆఘయిత్యానికి పాల్పడ్డాడు. దాంతో చిన్నారి తల్లి వద్దకు వెళ్లి ఏడుస్తూ జరిగిన విషయం చెప్పింది. వెంటనే ఆ తల్లి ఘోషాసుపత్రికి తీసుకువెళ్లింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు విచారణ నిర్వహించారు. నిందితుడిపై మహిళా పోలీసుస్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గూడ్‌షెడ్ పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు కేజీల గంజాయితో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ ప్రసన్నకుమార్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కలెక్టరేట్ నుంచి గూడ్‌షెడ్ వైపు స్కూటీపై వస్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా నగరంలోని శాంతినగర్‌కు చెందిన వాసుపల్లి విజయ్ గంజాయితో పట్టుబడ్డాడన్నారు. విజయ్‌పై గతంలోనే గంజాయి కేసు ఉందని సీఐ తెలిపారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

తెర్లాం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న నందబలగ గ్రామానికి చెందిన బమ్మిడి నారాయణరావును శనివారం పట్టుకున్నామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. అతడి నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమెదు చేశామన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి

రాజాం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బడి బయట పిల్లలను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదేశించారు. శనివారం రాత్రి కోండ్రు యూటీఎఫ్ నాయకులతో కలిసి బుచ్చింపేటలో నిర్వహించిన నేను బడికి పోతా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బొత్స వాసుదేవరావునాయుడు, కోండ్రు జగదీశ్, గురవాన నారాయణరావు, శాసపు రమేష్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు రెడ్డి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు


పవన్‌తేజ, మోక్షితశ్రీ, శ్రీనిధి, హిమబిందు, జయేంద్ర, సాయిహర్షవర్ధన్, లావణ్య, దినకర్, శాంతిప్రియ

రాజాం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో రాజాం ప్రాంతానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తా చాటి మెరుగైన ర్యాంకులను సాధించారు. మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటకు చెందిన పాలవలస పవన్ తేజ ఆలిండియా స్థాయిలో 3203 ర్యాంకు దక్కగా ఓబీసీ కేటగిరీలో 612 ర్యాంకు సాధించాడు. అలాగే మండల పరిధిలోని పొగిరి గ్రామానికి చెందిన బంకి మోక్షశ్రీ ఆలిండియా స్థాయిలో 3760 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 739 ర్యాంకు దక్కించుకుంది. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటలోని మారుతీ నగర్‌కు చెందిన మురపాక శ్రీనిధి ఆలిండియా స్థాయిలో 11446 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 2616వ ర్యాంకు సాధిం చింది.

●గజపతినగరం: మండలంలోని పురిటిపెంట న్యూకోలనీకి చెందిన నంగిరెడ్ల హిమబిందుకు జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 2414 ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో 441 ర్యాంకు సాధించింది.

●విజయనగరం కలెక్టరేట్: జేఈఈ మెయిన్స్ రెండో సెషన్‌లో నగరానికి చెందిన పలువురు విద్యార్థులకు మంచి ర్యాంకులు వచ్చాయి. గాజులరేగకు చెందిన బి.జయేంద్ర నాయుడు 99.85 పర్సంటైల్ సాధించారు. దత్తిరాజేరు మండలంలోని రామచంద్రపురానికి చెందిన పప్పల సాయిహర్షవర్ధన్‌కు 99.84 వచ్చింది. కొటారుబిల్లికి చెందిన కె.లావణ్యకు 99.42 పర్సంటైల్ వచ్చింది. మజ్జి జ్ఞానంహసినికి 98.28, దాసరి మోక్షకు 97.99, కె.రాజకిరణ్ 96.67, వి.తరుణ్‌కి 97.443, సిహెచ్.వర్షితకు 96.86, కొటారుబిల్లికి చెందిన కొరుపోలు మోనీషకు 94.34 పర్సంటైల్ వచ్చింది.

●రేగిడి: జేఈఈ మెయిన్స్‌లో మండలంలో కొమిరి గ్రామానికి చెందిన మురపాక శ్రీనిధి 99.264 పర్సంటైల్, అంబఖండికు చెందిన నడిపల్లి దినకర్ 99.98 , తునివాడకు చెందిన పల్లె శాంతిప్రియ 99.56 పర్సంటైల్ సాధించి సత్తాచాటారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్లక్ష్యం చేయకండి

చీపురుపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలను నిర్లక్ష్యం చేయకూడదని డీఎల్‌డీవో హేమసుందర్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం పంచాయతీ కార్యాలయంలో వ్యర్థాల సేకరణపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అత్యంత ప్రమాదకరమైనవన్నారు. వాతావరణ కాలుష్య కారకాల్లో ఇవి కూడా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇ.సురేష్, పంచాయతీ ఈవో యూనీస్ పాల్గొన్నారు.

22న సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న పురుషుల సీనియర్స్ విభాగంలో క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సీతారామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు జిల్లా కేంద్రంలో విజ్జీ స్టేడియంలో నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు తెలుపు డ్రెస్, సొంత క్రికెట్ కిట్‌తో హాజరుకావాలని కోరారు.

లాకౌట్ చట్ట విరుద్ధం

కొత్తవలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జేఎస్ఎల్ కర్మాగారంలో యాజమాన్యం విధించిన లాకౌట్ చట్ట విరుద్ధమని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను కోరారు. శనివారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిగాయి. 57 మంది కార్మికులకు మాత్రమే లే ఆఫ్ ఇస్తామని చెప్పడం కార్మిక చట్టాలకు విరుద్ధమని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. చర్చలలో కార్మిక సంఘాల తరపున నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, లగుడు వామాలు, పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య, యాజమాన్యం ప్రతినిధి గోపాలకృష్ణ హాజరయ్యారు.





సెంచూరియన్‌కు ప్రముఖుల రాక

నెల్లిమర్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన ప్రముఖులు సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్. రావు, ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజుతో మాట్లాడారు అనంతరం వర్సిటీలో కోర్సులు, ప్రయోగశాలలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎ.ఎస్.రాజా గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ సుగంధం, మేనేజర్ గీతా విశ్వనాథన్, సలహాదారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వివాదంపై అధికారుల విచారణ

కొత్తవలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండంలోని కంటకాపల్లి పంచాయతీలోసిమెంట్ పరిశ్రమకు ఉపాధి హామీ నిధులతో చెరువు గట్టుపై నుంచి రోడ్డు వేశారనే స్థానికులు ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు శనివారం క్షేత్ర పర్యటన చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస-విజయనగరం రోడ్డులోని కొత్త సుంకరపాలెం గ్రామం జంక్షన్‌కు సుమారు 2 కిలో మీటర్ల దూరంలో ఓ సిమెంట్ పరిశ్రమ ఉంది. కంటకాపల్లి రెవెన్యూలో సర్వే నెంబరు 142లో 45.10ఎకరాల విస్తీర్ణంలో నరసరాజు చెరువు నుంచి రోడ్డు నిర్మాణం చేస్తే పరిశ్రమకు అనుకూలంగా ఉంటుందని సదరు యాజమాన్యం భావించింది. అందుకు అనుగుణంగా కొత్త సుంకరపాలెం జంక్షన్ నుంచి దత్తి, దన్నినపేట గ్రామాలకు వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం కోసం గ్రామసభలో తీర్మానం చేయించారు. గ్రామసభలో తీర్మానం మేరకు రూ. 50 లక్షలతో చెరువులో నుంచి వేశారు. ఈ రోడ్డు నిర్మాణం 10 అడుగులు వెడల్పు కాకుండా 30 అడుగుల వెడల్పుతో రాత్రికి రాత్రే వేయించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. దాంతో పంచాయతీ రాజ్ శాఖ ఎస్ ఈ ఎం.శ్రీనివాస్, ఈఈ రత్నకుమార్, డీఈ స్వామినాయుడు, నీటిపారుదల శాఖ ఎస్ఈ స్వరూప్‌కుమార్, ఈఈ ఎంవీరమణ, డీఈ శ్రీచరణ్, ఏఈ హనుమంతరావు, డ్వామా పీడీ శారద, విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి, తహసీల్దార్ నీలకంఠరావు, ఎంపీడీవో రమణయ్య, ఏపీవో జనార్దనరావు తనిఖీ చేశారు నిదేవికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు తెలిపారు.

సామూహిక సీమంతాలు

బొబ్బిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి ఉన్నారు.

జిందాల్ కార్మికులను ఆదుకోండి

లక్కవరపుకోట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమ లాకౌట్ ప్రకటించడంతో రోడ్డునపడ్డామని ఎమ్మెల్యే లలితకుమారికి కార్మికులు వినతిపత్రం అందజేశారు. శనివారం ఆమె నివాసం వద్ద కలసి తమను ఆదుకోవాలని కోరారు.





